సాక్షి ఒడిశా

గురువారం । 30 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.91.595లు, బంగారం 9 గ్రాముల 350 మిల్లీగ్రాములు, వెండి 91 గ్రాము వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్కర్ష్ ఒడిశా సదస్సు విజయవంతం

రాష్ట్రంలో రెండు రోజులపాటు జరిగిన ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిషా కాన్‌క్లేవ్ 2025 విజయవంతమైందని సీఎం మోహన్‌చరణ్ ప్రకటించారు.

- 8లో



ఉత్సవాలకు సహకరించాలి

జయపురం జగన్నాథ్ మందిరం ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరపాలని పరిచాలన కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం సమావేశం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి నారాయణపూర్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. తొలొరంబ గ్రామానికి చెందిన బాబూరావు హుయిక బుధవారం విందు భోజనానికి రాయగడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైకుపై వస్తుండగా గ్రామ సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాబూరావుకు గాయాలు కావడంతో వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా పరిషత్ మాజీ సభ్యురాలు మృతి



కొయికీ రంధారి

కొరాపుట్: అనారోగ్యంతో జిల్లా పరిషత్ మాజీ సభ్యురాలు కోయికి రంధారి (26) మృతి చెందారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా నబరంగ్‌పూర్ సమితి బాసిని గ్రామంలో తుదిశ్వాస విడిచారు. గత విడత నబరంగ్‌పూర్ జోన్-1కి బీజేడి తరఫున ఈమె జిల్లా పరిషత్ సభ్యురాలిగా పనిచేశారు. మృతి విషయం తెలిసిన వెంటనే నబరంగ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, నబరంగ్‌పూర్ జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు మంజులా మజ్జి నివాళులు అర్పించారు. పెద్ద సంఖ్యలో బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



విద్యాశాఖ కార్యాలయం వద్ద బైఠాయించిన మధ్యాహ్న భోజన వంట మహిళలు

రాయగడ : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన వంట సహాయకులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి బసంతకుమార్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నెలకు అందిస్తున్న రూ. మూడు వేలతో కుటుంబ పోషణ కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా రూ.23,560 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట సహాయకుల మహాసంఘం అధ్యక్షులు జొగేంద్ర స్వయి నేతృత్వంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో వివిధ పాఠశాలల వంట సహాయకులు పాల్గొన్నారు.

ధామ్రాకు తొలి విమానం రాక



విమానం వద్ద సిబ్బంది

భువనేశ్వర్: భద్రక్ జిల్లా బాసుదేవ్‌పూర్ ధామ్రా ఎయిర్‌స్ట్రిప్‌కు బుధవారం తొలి విమానం చేరింది. అహ్మదాబాద్ నుంచి ఈ విమానం వచ్చింది. ఆదానీ గ్రూప్ 2018లో ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఎయిర్‌స్ట్రిప్ అభివృద్ధి కోసం రాష్ట్రం 274 ఎకరాల విస్తీర్ణపు స్థలం కేటాయించింది. ఆదానీ పోర్ట్సు అనుబంధ సంస్థ ధామ్రా పోర్ట్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యంలో ఈ ఎయిర్‌స్ట్రిప్ పనిచేస్తుంది.

సత్తాచాటిన జీఐఈటీ విద్యార్థులు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు, సిబ్బంది

రాయగడ: రౌర్కెలా ఎన్‌ఐటీ ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన బీధి-25 క్రీడోత్సవాల్లో గుణుపూర్‌కు చెందిన గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయం విద్యార్థులు సత్తాచాటారు. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ఖోఖో తదితర అంశాల్లో విజేతలుగా నిలిచారు. విద్యార్థులను ప్రొఫెసర్ ప్రకాష్ రంజన్ సాహు, ఆదిత్య మహాకుల్, అధ్యాపకులు ఝురణా మహారాణ బుధవారం అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పండా, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.వి.జగన్నాథరావు, క్రీడా శాఖాధికారి రవీంద్ర పండా, ఆశీష్ తివారి తదితరులు పాల్గొన్నారు..

మహిళా పారిశ్రామికవేత్తలకు..

ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు



స్కిల్డ్ ఇన్ ఒడిశా సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మహిళా వ్యాపారులు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి వెల్లడి
- రెండో రోజూ కొనసాగిన ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిషా కాన్‌క్లేవ్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోందని, ఈ క్రమంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి మోహన్ మాఝి ప్రకటించారు. బుధవారం ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిషా కాన్‌క్లేవ్ రెండవ రోజు కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధికారత కోసం మహిళలు మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సూక్ష్మ, లఘు, మధ్య తరహా వ్యాపార (ఎంఎస్ఎంఈ) రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేస్తుందన్నారు. ఇప్పటికే మహిళల సాధికారతకు సుభద్ర యోజన అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. చిన్న వ్యాపారాల ద్వారా మహిళలు స్వావలంబన సాధిస్తున్నారని చెప్పారు. 2036 నాటికి వికసిత్ ఒడిశా, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే లక్ష్యంతో రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.పారిశ్రామిక రంగంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిషా లిమిటెడ్ (ఇపికాల్) ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతు, ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకమైన పారిశ్రామిక పార్కు ఉపకరిస్తుందన్నారు. మహిళల నేతృత్వంలోని వ్యాపారాలకు సహాయం, అవకాశాలు కల్పించేందుకు ఇపికాల్‌లో ప్రత్యేక సెల్ సేవలందిస్తుందని వివరించారు. సమగ్ర సుస్థిర మహిళా వ్యాపార పర్యావరణ వ్యవస్థ రూపకల్పనకు ప్రభుత్వం పలు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. మహిళల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రెండు చర్యలు మహిళలు స్వతంత్రంగా వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహిస్తాయని తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి హేమంత్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే సుభద్ర యోజన కింద మహిళా సాధికారత చేపట్టినట్లు తెలిపారు. సుభద్ర యోజనను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు అనుసంధానం చేయాలనుకుంటున్నామని చెప్పారు. మహిళలకు వ్యాపార రంగంలో తగిన వేదికను అందించడం ద్వారా వారిని ప్రోత్సహిస్తామన్నారు. రెండో రోజు ప్లీనరీ సమావేశాల్లో నైపుణ్యం, పునరుత్పాదక ఇంధనం, పరికరాలు, టెక్స్‌టైల్, దుస్తులు, వ్యవసాయం, ఆహార ఉత్పాదన, పర్యాటక అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఫార్మా-బయోటెక్నాలజీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఓడరేవులు, విమానాశ్రయం, రైల్వే, రహదారులు, ఫిల్మ్ - మీడియా అంశాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీ క్షేత్రం చేరిన రథ కలప



ఈ ఏడాది జరగనున్న జగన్నాథ రథయాత్ర సన్నాహాలు ఊపందుకుంటున్నాయి. మూడు కొత్త రథాల తయారీ కోసం తొలి విడత కింద 101 కలప దుంగలు చేరాయి. వీటిలో 48 ఒసానొ, 53 ధవురా దుంగలు ఉన్నాయి. నయాగడ్ అటవీ శాఖ నుంచి ఇవి శ్రీ క్షేత్రానికి చేరాయి. రథాల తయారీ కోసం మొత్తం 865 దుంగలు అవసరం. గత ఏడాది రథాల తయారీ కోసం తీసుకొచ్చిన వాటిలో 51 దుంగలు మిగిలే ఉన్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది 814 దుంగలు అవసరమయ్యాయి. ఏటా శ్రీ పంచమి నాడు రథ కలప అంకురార్పణ చేయడం ఆనవాయితీ.

- భువనేశ్వర్

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి



పశ్చిమ ఒడిశా సంబలపూర్ జిల్లా ఝుజుమొరా రేంజ్‌లోని జాదులోయిసింగ్ గ్రామ సమీపంలోని ఓ పొలంలో ఏనుగు మృతదేహాన్ని గుర్తించారు. దీని వయసు 20 ఏళ్లు ఉంటుందని అధికారుల అంచనా. గ్రామస్తుల నుంచి సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. విద్యుదాఘాతంతోనే ఏనుగు మృతి చెందినట్లు భావిస్తున్నామని, పూర్తి విచారణ చేపడతామని అధికారులు తెలిపారు.

- భువనేశ్వర్

వేటగాళ్లను పసిగట్టిన ఏఐ కెమెరా



మయూర్‌భంజ్ జిల్లా సిమిలిపాల్ అభయారణ్యంలో జంతువుల వేటకు సిద్ధమైన వేటగాళ్ల బృందాన్ని కృత్రిమ మేధ (ఏఐ) కెమెరా పసిగట్టింది. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కెమెరా వీరి కదలికలను ఫొటోలు తీయడంతో ఐదుగురు వేటగాళ్లను గుర్తించారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేయగా.. ముగ్గురు తప్పించుకున్నారు. వేటకు వినియోగించే 5 నాటు తుపాకులు, విల్లు, బాణం, జింక, దుప్పి కొమ్ములు స్వాధీనం చేసుకున్నారు.

- భువనేశ్వర్

మహేంద్రగిరి అభివృద్ధి కమిటీలో చోటేదీ?



కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వచ్చిన ఆదివాసీ మహాసంఘ్ సభ్యులు

పర్లాకిమిడి: మహేంద్రగిరి అభివృద్ధి కమిటీలో కోయిపూర్, బారోఘోరో, లక్ష్మీపూర్, రంప, మాలువ ప్రాంత ప్రజా ప్రతినిధులను కాదని ఇతర ప్రాంతాల వారు కమిటీలో ఉండటంపై ఆదివాసీ మహాసంఘ్ (గజపతి) అధ్యక్షులు నీరో భుయ్యాన్ తప్పుపట్టారు. ఈ మేరకు బుధవారం ఐదు పంచాయతీల ప్రజలతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ కమిషనర్(గంజాం)కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర రవాణా, ఖనిజ శాఖా మంత్రి బిభూతి జెన్నా మహేంద్రగిరి పర్యటించిన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఒక ప్రాంతీయ కమిటీ వేశారని, అందులో కోయిపూర్, రాయఘడ సమితి లక్ష్మీపూర్, మాళువ, బారోఘోరో ఆదివాసీలకు చోటు నివ్వకపోవడం తగదన్నారు. మహేంద్రంలో నిర్మించిన ఇతర భవనాలు కూల్చివేయకపోతే, అదే ప్రాంతంలో చెట్లు నరికి తాము కూడా ఇళ్లు నిర్మించుకుంటామని భుయ్యాన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాయఘడ మాజీ చైర్మన్, జెడ్పీటీసీ ధనేశ్వర భుయ్యాన్, పితాంబర్ నాయక్, జగన్నాథ భుయ్యాన్, మాజీ సర్పంచ్ సన్యాసి కార్జి, రాజేంద్ర భుయ్యాన్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న చెట్టు

- ఇద్దరు మృతి.. ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న అభీర్ మఝి

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి బసనిగుడ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కతపొడ పంచాయితీ అంతియగుడ గ్రామానికి చెందిన పవిత్ర అంతియ, కొలార్ పంచాయతీ గనిపుట్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్, బలిగాం పంచాయతీ అటలగుడ గ్రామానికి చెందిన అభీర్ మఝిలు కలిసి బైక్‌పై వస్తుండగా బాసునిగుడ సమీపంలోమలుపు తిరుగుతుండగగా అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో ముగ్గురూ కిందపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్ సాహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించగా కృష్ణకుమార్, పవిత్ర అంతియ మృతిచెందారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బొయిపరిగుడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంభమేళాలో కొరాపుట్ వాసులు క్షేమం



బుధవారం జరిగిన కుంభమేళాలో కొరాపుట్ తెలుగు ప్రజలు

కొరాపుట్: మహా కుంభమేళాకు వెళ్లిన కొరాపుట్ జిల్లా వాసులు సురక్షితంగా ఉన్నారు. బుధవారం మౌని అమావాస్య సందర్భంగా దాదాపు 10 కోట్ల మంది కుంభమేళాలో స్నానమాచరించడానికి వెళ్లారు. అక్కడ జరిగిన తొక్కిసలాటలో సుమారు 20 మంది మృత్యువాతపడ్డారు. కొరాపుట్ నుంచి కూడా ఈ నెల 26న ప్రభుత్వం ప్రత్యేక ఓఎస్ఆర్‌టీసీ బస్సును పంపించింది. జిల్లా కలెక్టర్ వీ.కీర్తివాసన్ స్వయంగా జెండా ఊపి ప్రయాణికులకు వీడ్కోలు పలికారు. అందులో కొరాపుట్, జయపూర్‌లకు చెందిన తెలుగు ప్రజలు ఎక్కువ మంది ఉన్నారు. వీరందరూ సురక్షితంగా ఉన్నట్లు స్థానికులకు సమాచారం అందింది.

63 మంది ప్రిన్సిపాళ్లకు జీతాలు నిలిపివేత

భువనేశ్వర్: కాలేజ్ అకౌంట్స్ పోర్టల్ అప్లికేషన్ (క్యాపా) మాడ్యూల్‌లో కళాశాల ఖాతాలను నిర్వహించడంలో విఫలమైనందుకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ 63 ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల వేతనాలను నిలిపివేసింది. ఈ మేరకు అకౌంట్స్ ఆఫీసర్ జుమార్‌కుమార్ మాఝి ఉత్తర్వులు జారీ చేశారు. క్యాపా నిబంధనల ప్రకారం కార్యాచరణ పాటించే వరకు జీతాల నిలిపివేత నిరవధికంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. క్యాపా పోర్టల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన కళాశాల ఖాతాలను నవీకరించడానికి ఉన్నత విద్యా శాఖ పలుమార్లు ముందస్తుగా హెచ్చరించిన పట్టించుకోకపోవడంతో ఈ చర్య తీసుకున్నటట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాజ్‌పూర్ జిల్లాలో అత్యధికంగా 11 మందికి, ఖుర్దాలో 8 మందికి, గంజాంలో 8 మందికి, జగత్‌సింగ్‌పూర్‌లో ఐదుగురికి, కటక్, బాలాసోర్‌లో నలుగురు, పూరీలో ముగ్గురు చొప్పున ప్రిన్సిపాల్స్ వేతనాలు నిలిపివేశారు. కాలేజ్ అకౌంట్స్ పోర్టల్ అప్లికేషన్ కళాశాలల ఆర్థిక నిర్వహణను క్రమబద్ధీకరించడానికి దోహదపడుతుంది.

అన్నయ్య చేతిలో తమ్ముడు హతం



మాధ సోడి మృతదేహం

మల్కన్‌గిరి : జిల్లాలోని కలిమెల సమితి తాటిగూడ గ్రామంలో అన్నయ్య చేతిలో తమ్ముడు హతమయ్యాడు. మాధ సోడి(48), భీమా సోడి అన్నదమ్ములు. తండ్రి ఇర్మా సోడి కొద్దినెలల కిందటే మృతిచెందాడు. అప్పటి నుంచి ఆస్తి కోసం అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మాడ సోడి పంట పొలంలో కాపలాగా నిద్రపోతుండగా అన్నయ్య భీమా వెళ్లి కత్తితో గొంతు కోసం హత్య చేశాడు. ఏమీ జరగనట్లు తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య వెళ్లగా రక్తపు మడుగులో పడి వున్న మాధను చూసి కేకలు వేసింది. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ చంద్రకాంత్ తండి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. భీమాను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించాడు. హత్యకు వాడిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్ పొడిగింపు

భువనేశ్వర్: స్థానిక జనతా మైదాన్‌లో కొనసాగుతున్న ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్ ప్రదర్శన మరో రెండు రోజుల వరకు పొడిగించారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు సాధారణ ప్రజల సందర్శన కోసం తెరిచి ఉంటుందని ప్రకటించారు. వాస్తవానికి బుధవారంతోనే ప్రదర్శన ముగియాల్సి ఉంది.

బీఎస్ఎఫ్ సేవా శిబిరానికి స్పందన



పంపిణీ సామగ్రితో బీఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు



హాజరైన గిరిజనులు

మల్కన్‌గిరి : జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి ఖల్‌గూఢ గ్రామం వద్ద 180 బెటాలియాన్ జవాన్లు బుధవారం జన సంపర్క్ శిబిరం ఏర్పాటు చేశారు. ఆంద్రాహాళ పంచాయతీ పరిధిలోని సింద్రీగూడ, కందిపోదర్, వాల్యపదర్, బద్బేల్ గ్రామాల ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించారు. నిత్యావసర సరుకులు, దుస్తులు, క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి బీఎస్ఎఫ్ సహాయ సహకారాలు అందిస్తుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొరాపూట్ బీఎస్ఎఫ్ రెండో కమాండర్ సత్యేంద్రకుమార్ రీడర్, డిప్యూటీ కమాండార్ రాకేష్‌కుమార్, సునీల్ కుమార్ జాకబ్, ఆంద్రాహల్ 180 బెటాలియాన్ కమాండర్ విజయ్‌కుమార్ పాండే తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుస్తకాలు వితరణ

ఎచ్చెర్ల క్యాంపస్: సోంపేట మండలంలోని బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జల్లు సుబ్బారావు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి పుస్తకాలు వితరణగా అందజేశారు. సుమారు రూ.50 వేలు విలువ చేసే సాహిత్య, అనువాద, తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలు వీసీ రజినికి అందించారు. విద్యార్థులకు అకడమిక్‌గా, పరిశోధనలకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు.

29ఈటీఎల్26: వీసీ రజినికి పుస్తకాలు అందజేస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి



మృతి చెందిన మేక పిల్లలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తామాడలో వీధి కుక్కల దాడిలో ఆరు మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాసి రాము మేకల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి పక్కన కంచెవేసి అందులో మేక పిల్లలను పెంచుతున్నాడు. కాగా ఆ మేక పిల్లలపై బుధవారం తెల్లవారుజామున గ్రామంలోని కుక్కలు దాడి చేశాయి. దీంతో ఆరు మేక పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ వీధుల్లో కుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నా, పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ విద్యా సదస్సుకు ఆహ్వానం



ముద్దాడ బాలరాజు

హిరమండలం: మండలంలోని దుర్బలాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజుకు జాతీయ విద్యా సదస్సుకు ఆహ్వానం అందినట్లు బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీన ఢిల్లీలో జరగనున్న నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ఈ-లెర్నింగ్ సదస్సులో పాల్గొని ప్రస్తుత విద్యావిధానాలు, విద్యా విధానంలో నూతన పోకడలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ-లెర్నింగ్ ఆవశ్యకతపై ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా, పెడగాజికల్ అనలిస్ట్‌గా సేవలందిస్తూ, పోటీ పరీక్షలకు సంబంధించిన కొన్ని కాంపిటేటివ్ పుస్తకాలను సైతం రచించిన బాలరాజు జాతీయ స్థాయి సదస్సుకు హాజరు కానుండడంపై ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


సామాజిక ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చినవారికి మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


ఆ నేత్రాలు సజీవం



రమణమూర్తి(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో ఫాజుల్‌బాగ్‌పేటలోని దేవాంగుల వీధిలో నివాసముంటున్న జామి రమణమూర్తి జయరాం(62) అనారోగ్యంతో మృతి చెందారు. అయితే మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు శిల్లా మణి, భార్య కామేశ్వరి, కుమారుడు నవీన్, కోడలు గౌతమిలు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, సహాయకుడు నంది ఉమాశంకర్‌లు వచ్చి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గా, శ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్ అధికారులు

సోంపేట: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం దాడులు నిర్వహించి మందస మండలంలోని గుడ్డికోల, బుడారసింగి గ్రామాల్లో 1,900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. అదే గ్రామాల పరిధిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 95 లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సోంపేట, శ్రీకాకుళం టీమ్‌లు పాల్గొన్నాయి.

ఉత్కర్ష్ ఒడిశా సదస్సు విజయవంతం

- 145 అవగాహన ఒప్పందాలు ఖరారు
- రూ.12.89 లక్షల కోట్ల నికర పెట్టుబడులు



సదస్సు ముఖ్యాంశాలు వివరిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ఉత్కర్ష్ ఒడిశా సదస్సు విజయోత్సాహం



ఉప ముఖ్యమంత్రి సమక్షంలో పెట్టుబడుల ఒప్పందం

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండు రోజులపాటు జరిగిన ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్ 2025 విజయవంతమైందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం సమగ్రంగా 145 అవగాహన ఒప్పంద (ఎంఓయూ) పత్రాలపై సంతకాలు జరిగాయని చెప్పారు. వీటి ప్రకారం రాష్ట్రానికి రూ.12.89 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయని తెలిపారు. రసాయనాలు, పెట్రో కెమికల్స్, జౌళి, మైనింగ్, మెటలర్జీ, పునరుత్పాదక ఇంధనం, సాంకేతిక సమాచారం, పర్యటన, ఆహార ఉత్పాదన వంటి విభిన్న రంగాలలో రూ.12.89 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదరడం విశేషంగా పేర్కొన్నారు.

ఉద్యోగ అవకాశాలు..

ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు పుష్కలమైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని, తాజా ఒప్పందాల ప్రకారం దాదాపు 8.94 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మరో 448 సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచాయని తెలిపారు. ఈ మేరకు రూ. 3.84 లక్షల కోట్ల పెట్టుబడి కోసం ప్రతిపాదన పత్రాలపై సంతకాలు చేశాయని, ఇవన్నీ వాస్తవ కార్యాచరణ నోచుకుంటే రాష్ట్ర యువతకు మరో 3.92 లక్షల ఉద్యోగాల ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

సమగ్ర పెట్టుబడులు రూ.16.73 లక్షల కోట్లు..

ఉత్కర్ష్ ఒడిశా మేక్ ఇన్ ఒడిశా కాంక్లేవ్ 2025 పారిశ్రామికవేత్తల్ని విశేషంగా ప్రభావితం చేసింది. 20 పైబడిన వర్తక, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో 593 ప్రాజెక్టుల ప్రతిపాదనలతో సమగ్రంగా రూ.16.73 లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రముఖ వ్యాపారవేత్తలు ముందుకు రావడం విశేషం. ఈ పెట్టుబడులతో రాష్ట్ర యువతకు సమగ్రంగా 12.88 లక్షల ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి భాగస్వామ్య దేశాల ప్రతినిధులతో సహా 16 దేశాల నుంచి ప్రతినిధులు ఈ కాన్‌క్లేవ్‌లో పాలుపంచుకున్నారు.

జయపురం వాసులకు సన్మానం



నిర్వాహకులతో సన్మాన గ్రహీతలు

జయపురం: కొరాపుట్ జిల్లాలో వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న ముగ్గురు ప్రముఖులను గౌహతిలో ఇంటర్ నేషనల్ లయిన్స్ క్లబ్ వారు నిర్వహించిన కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్ వాసులు ముగ్గురిని సన్మానించారు. వీరిలో ఇటీవల ఒడిశా అగ్రికల్చరల్ యూనివర్సిటీ వారితో డాక్టరేట్ పొందిన కుంద్ర సమితి ఫార్మర్ కస్టోడియన్ మండీ రాణి డాక్టర్ రొయిమతి ఘివురియకు 'వుయ్ సేవ్ ఇండియా అవార్డు-2024' తో సన్మానించారు. కొరాపుట్ జిల్లా మచ్చర గ్రామం ప్రోగ్రెషిడ్ ఫార్మర్ దహణ భొయ్‌కు 'ఉమెన్ ఎంపవర్‌మెంట్' కేటగిరిలో సత్కరించారు. జయపురంలో గల ఎం.ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ కేంద్ర సైంటిస్ట్ డాక్టర్ కార్తీక చరణ లెంకను వైల్డ్ లైఫ్ కంజెర్వేషన్ కేటగిరిలో సన్మానించారు.

నీతి ఆయోగ్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న విద్యశాఖాధికారి విశ్వనాథ్ సాహు, హాజరైన ఉపాధ్యాయులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో వంద పాఠశాలలకు చెందిన వంద మంది ఎఫ్ఎల్ఎన్ గ్రేడ్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు నీతి ఆయోగ్ శిక్షణను జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ బుధవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో అభ్యసన పద్ధతులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

అనంతరం వన్ టు వన్ ఇంటరాక్టివ్ కరస్పాండెన్స్ బోర్డు టేబుల్ ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి విశ్వనాథ్ సాహు, జిల్లా అదనపు సంక్షేమాధికారి సుమంత్ కుమార్ మాఝి, ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, సురేంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు.

గుసాని సమితిలో సాధారణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితిలో 11వ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేయగా.. సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, బి.డి.ఓ.గౌరచంద్ర పట్నాయిక్ తదితరులు హాజరయ్యారు. గుసాని సమితిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమితిలో చర్చించారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కులపై అవగాహన



ప్రసంగిస్తున్న సుబ్రత్ ఆచారి

రాయగడ: జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం సివిల్ కోర్టు సమావేశ మందిరంలో ట్రాన్స్‌జెండర్ల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ కార్యదర్శి సుబ్రత్ ఆచారి మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, పింఛన్లు వంటి సౌకర్యాలను ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీగల్ సెల్ ఫ్రంట్ ఆఫీసర్ రిటర్నర్ భారతీ త్రిపాఠి మాట్లాడుతూ సమాజంలో మంచి స్థానం సంపాదించుకునేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో 40 మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

నాలుగున్నర తులాల బంగారం చోరీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో బుధవారం నాలుగున్నర తులాల బంగారం చోరీకి గురయ్యింది. ఒక ఇంటి యజమాని తాళం వేసి బయటకు వెళ్లి, గంటన్నర వ్యవధిలో మళ్లీ ఇంటికొచ్చినంత సమయంలో బంగారం, రూ.21 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం .. ఇప్పిలి వెంకటరత్నం అనే మహిళ జిల్లా పరిషత్ ఎదురుగా పండ్ల దుకాణం నడుపుతూ తన కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈమె ఏపీహెచ్‌బీకాలనీలో అంబేడ్కర్ భవన్ ఎదురుగా కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటోంది. బుధవారం ఉదయం ఎప్పటిలాగే పండ్ల దుకాణానికి వెళ్లిన ఈమె సాయంత్రం ఇంటికొచ్చింది. మరలా సాయంత్రం ఐదు గంటలకు దుకాణానికి వెళ్లి, 6:30 గంటల ప్రాంతంలో ఇంటికొచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తలుపులు కూడా తీసి ఉండడంతో ఆందోళనకు గురైన ఆమె చూసేసరికి అందులో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురవ్వడంతో లబోదిబోమంది. స్థానికుల సాయంతో ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, క్లూస్ టీమ్‌తో వచ్చిన ఎస్ఐ హరికృష్ణ చుట్టుపక్కల పరిసరాలను నిశితంగా పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పశునష్ట పరిహారం జమ

పాతపట్నం: జిల్లాలో పశునష్ట పరిహార పథకం ద్వారా పాడి రైతుల ఖాతాల్లో రూ.13,42,52,500 కోట్లు జమ చేసినట్లు జిల్లా పశు సంవర్థకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.రాజగోపాల్‌రావు అన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 4,553 ఆవుజాతి పాడి పశువులకు, 176 గేదె జాతి, 1,142 గొర్రెలు, మేకలకు నష్ట పరిహార పథకం ద్వారా నిధులు పాడి రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. పశువైద్య శిబిరాల ద్వారా 18,826 మంది పశు పోషకులకు లబ్ధి కలిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న పశుగ్రాసాల వైపు పాడి రైతులంతా దృష్టి సారించాలని సూచించారు. మినీ గోకులం నిర్మాణాలు ఎవరైతే 20 రోజుల్లో పూర్తి చేస్తామని లిఖిత పూర్వకంగా వస్తారో, వారికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు జిల్లా సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం సహాయ సంచాలకుడు డాక్టర్ యోగి, టెక్కలి డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ వి.జయరాజు, డాక్టర్ మంచు కరుణాకరరావు, పశుగణాభివృద్ధి సంస్థ వైద్యురాలు రాధాకుమారి, పశు వైద్యుడు పి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కళానికేతన్ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: కళాసేవలోనే ముత్యాలమ్మ కళానికేతన్ పనిచేస్తుందని సంస్థ నిర్వాహక కార్యదర్శి కేశిరెడ్డి రాజేశ్వరి అన్నారు. జిల్లా కేంద్రంలోని గుజరాతిపేటలో నాటిక పరిషత్-2025 పోటీల కరపత్రం బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ సహకారంతో ఈ నెల 9నుంచి మూడు రోజులు బాపూజీ కళామందిర్‌లో నాటిక పోటీలు జరుగుతాయని చెప్పారు. 9న స్వేచ్ఛ(హైదరాబాద్), జనగరల్ బోగీలు(కొలకలూరు), 10న చిగురు మేఘం(గుంటూరు), బ్రహ్మ స్వరూపం(విజయవాడ), 11న నిశ్శబ్దం నీ ఖరీదెంత(విశాఖ), దేవరాగం(ఉత్తరాంధ్ర) నాటిక ప్రదర్శనలు జరుగుతాయని రాజేశ్వరి తెలిపారు. సమావేశంలో కళా పరిషత్ నిర్వాహక కమిటీ సభ్యులు కేశిరెడ్డి శ్యామ్‌కుమార్, కె.శాంతారామ్, రఘుపాత్రుని శ్రీకాంత్, బత్తుల జ్యోతి, పి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులు రొక్కం భాస్కరరావు, కీర్తి, సంతోషి పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



ర్యాలీలో కొరాపుట్ ఎంపీ ఉల్క, పార్టీ శ్రేణులు

జయపురం: త్వరలో జరుగనున్న పంచాయతీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్క కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం బొయిపరిగుడ ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల హృదయాలలో నిలిచి ఉంటుందని, పార్టీని ప్రజల నుంచి ఎవరూ దూరం చేయలేరన్నారు. అనేక పార్టీలు పుడుతూ ఉంటాయి, కనుమరుగవుతూ ఉంటాయన్నారు. అనేక త్యాగాలు చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ చిరంజీవిగా ఉంటుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజాసమస్యలపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కృష్ణ కులదీప్, అనమ దియాన్, మల్కనగిరి మాజీ ఎమ్మెల్యే నిమయ్ చరణ సర్కార్, బబుల బెనియ, బొయిపరిగుడ సమితి నుంచి జిల్లా పరిషత్‌కు ఎన్నికైన కాంగ్రెస్ సభ్యురాలు మణి జాని, బసత్య మహంతి, బాలాజీ రావు, ధనేశ్వర మఝి, కునా మహంతి, రఘు మాలి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

జయపురం: జయపురం జగన్నాథ్ మందిరం ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరపాలని పరిచాలన కమిటీ నిర్ణయించింది. బుధవారం మందిరం ప్రాంగణంలో కమిటీ ఉపాధ్యక్షురాలు బినోదిని శాంతపాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశానికి జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద బాహినీపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవదాయ, ధర్మాదాయ అధికారి, జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన మాట్లాడుతూ శ్రీపంచమి రోజున ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. జగన్నాథ సంస్కృతి ప్రచారం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మందిర పరిసర ప్రాంతంలో గల వల్లభనారాయణ మందిరం, మా భగవతి మందిరాలలో వేంచేసి ఉన్న దేవదేవీలకు నూతన వస్త్రాలు సమర్పించే కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. మందిర ప్రతిష్ఠోత్సవంలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మందిరం ప్రాంతంలో గడ్డి శాల ఏర్పాటు చేయాలని సూచించారు. జగన్నాథ్ సేవా సమితి కోశాధికారి భవానీ చరణ ఆచార్య, కార్యదర్శి స్వాదీన సాహు, ఇంజినీర్ కేదార బెహరా, నయన కిశోర్ మహంతి, ఆలయ సేవకులు డొంబురుదొర పండా, జగన్నాథ్ త్రిపాఠీ, భువనేశ్వర ప్రసాద్ మిశ్ర, నర్సింహ త్రిపాఠి, కృష్ణ చంద్ర నంద, మదన్‌మోహన్ నాయక్, రశ్మీ రంజన్ పాగర్, రబినారాయణ నందో, డాక్టర్ శివరాం నిశంకో, శివాజీ పట్నాయక్, ఎస్.సుందర్, బి.హరిప్రసాద్ రావు, కృష్ణ చంద్రపాత్రో, లక్ష్మణ మహాపాత్రో, జి.మహేష్, తపస్విని సాహు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



అధికారులతో ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: కుష్టు వ్యాధి నివారణపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు, చైతన్య ర్యాలీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ ముబార్ అలీ, జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షకులు సౌమ్యరాణి గౌడో, కుష్టురోగ నిపుణులు ఇందిరా మహాపాత్రో, జనస్వస్థ అధికారి రబినారాయణ దాస్, ఎ.డి.పి.హెచ్.ఓ ఆనంద శర్మ, డాక్టర్ రామకృష్ణ నాయుడు, గుసాని సమితి వైద్య విస్తరణాధికారి మమతా పాడీ, ఇతర సమితి స్థాయి హెల్త్ వర్కర్లు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో కుష్టు రోగులను గుర్తించి వారికి మందులు ఇవ్వాలని, దీనికోసం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు జిల్లా స్థాయిలో అన్ని సమితి కేంద్రాల్లో కుష్టురోగ సచేతన అభియాన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో కుష్టు రోగ నివారణకు తమ వంతు కృషిచేస్తామని ప్రమాణం చేయించారు. ప్రతీ సమితి, పంచాయతీ స్థాయిలో కుష్టురోగ నివారణకు సచేతన కార్యక్రమం ఏర్పాటు చేయాలని, ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలు విధిగా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా బాలికా పాఠశాల వార్షికోత్సవం



వేదికపై ఎమ్మెల్యే నర్సింగ్, అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి శిక్‌పల్లి ఎస్ఎస్‌డీ బాలికల పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు, హెచ్ఎం మనోరమ స్వాయి, ఉపాధ్యాయులు రూపాలి రౌయి, సంయుక్త మహంతి, రాణి దోరా, సోనాలీ దాస్, ఝురనా శత్పతి, టుటు మహపాత్రో, ఆనంద్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

ఆమదాలవలస: పట్టణ శివారులోని లక్ష్మణరాజు పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ద్విచక్ర వాహనం నుంచి మంటలు వచ్చి వాహనం దగ్ధమయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన అల్లాడ రాజు తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించుకొని బైక్‌ను స్టార్ట్ చేస్తున్న తరుణంలో ట్యాంక్ నుంచి మంటలు వచ్చాయి. ఇది గమనించిన బంక్ సిబ్బంది సాహసం చేసి, బంక్ నుంచి సుమారు పది అడుగుల దూరం వరకు బైక్‌ను తీసుకెళ్లి అక్కడ విడిచిపెట్టారు. వెంటనే బైక్‌ను స్టాండ్ వేసి దూరం వెళ్లిపోయారు. అనంతరం పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది, స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు ఆగకపోవడంతో పెట్రోల్ బంక్‌లోని మంటలు అదుపు చేసే గ్యాస్‌ను తీసుకొచ్చి స్ప్రే చేశారు. దీంతో మంటలు ఆగాయి. అయితే సిబ్బంది అప్రమత్తంగా లేకుంటే పెట్రోల్ బంక్‌లో పెను ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. ఒక్క క్షణంలో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

అట్రాసిటి కేసు నమోదుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ రాంబాబు, పక్కనే ఎస్సై కళాధర్

వీరఘట్టం: మండలంలోని బూరుగ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై బుధవారం పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు వీరఘట్టంలోని బార్నాలవీధికి వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు కేసు నమోదైనవారు, సంఘటనా స్థలంలో ఉన్నవారితో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు.ఫిర్యాదుదారు ఇచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆయనతో పాటు వీరఘట్టం ఎస్సై జి.కళాధర్ ఉన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని కొంచ గ్రామం శివారులో ఉన్న జీడితోటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. వారి నుంచి రూ.32,150లను స్వాధీనం చేసుకుని, 4 బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఈ నెల 31 వరకు అవకాశం

పార్వతీపురంటౌన్: టీచర్ ఇన్ఫర్‌మేషన్ సిస్టం డేటాలో అప్‌డేట్ చేసేటప్పుడు ఆన్‌లైన్‌లో ఏమైనా తప్పుగా నమోదు చేసినట్లయితే వాటిని సరిదిద్దుకోవడానికి ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చామని డీఈఓ ఎస్. తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ ఉపాధ్యాయుడు అయితే తప్పుగా నమోదు చేసి ఉన్నారో వారు శుక్రవారం లోపు తిరిగి నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

చీటింగ్ కేసులో ముద్దాయికి ఆరునెలల జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన చీటింగ్ కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 6వేలు జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం మండలం పురిటిపెంటకు చెందిన చలుమూరి వెంకట భాస్కరరావు అనే నిందితుడు ఐటీ మోసానికి పాల్పడడంతో బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ డి.లక్ష్మణరావు కేసు నమోదుచేసి, 2019 మే 31న రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. వన్‌టౌన్‌పోలీసులు ఈ కేసులో ప్రాసిక్యూషన్ సమయంలో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు, రూ. 8వేలు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ కుమారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ వివరించారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు: పార్వతీపురం మన్యంజిల్లా పరుశరాంపురం నుంచి అలమండకు ఆరు పశువులను తరలిస్తున్న బొలెరో వ్యాన్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై రాజేష్ బుధవారం తెలిపారు. స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా వ్యాన్‌లో పశువులు ఉండడాన్ని గమనించి పశువుల యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సారాతో పట్టుబడిన మహిళకు రిమాండ్

కొత్తవలస: వేపాడ మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 5 లీటర్ల సారాతో సిమ్మ ఈశ్వరమ్మ అనే మహిళ పట్టుబడింది. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో విశాఖపట్నంలో గల సెంట్రల్ జైల్‌కు తరలించినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఎన్.రమశ్రీ, వీఎన్.రాజు, సిబ్బంది బి.రాముడు, వీర్రాజు, ప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి



మృతి చెందిన సంతోష్

పార్వతీపురంటౌన్: పట్టణలోని ఫ్లైఓవర్‌పై బుధవారం బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు పట్టణ ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్ఎన్‌పీ కాలనీకి చెందిన రావుపల్లి సంతోష్ కుమార్ (36) పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. భోజనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్ పై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

వనంగుడికి చేరుకున్న అమ్మవారి ఘటాలు ● వచ్చేనెల 4న అమ్మవారి మారుజాతర



అమ్మవారికి మొక్కుబడిగా ఘటం చెల్లిస్తున్న భక్తురాలు



ప్రధానాలయం వీధిలో అమ్మవారి ఘటాలు



అమ్మవారి ఘటాల అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారి గద్దె వద్ద ఘటాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తప్పెటగుళ్లు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. జన్నివారి ఇంటివద్ద పూజలందుకున్న అమ్మవారి ఘటాలు చదురుగుడి నుంచి మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటలకు తిరువీధి కార్యక్రమానికి బయల్దేరి ముందుగా గిరడ, పూడి, కుప్పిలి వారిళ్లలో తొలి పూజలు అందుకున్నాయి. అక్కడినుంచి గ్రామంలోని అన్ని పుర వీధుల్లో అమ్మవారి ఘటాలకు తిరువీధి నిర్వహించి, బుధవారం ఉదయం 9.20గంటలకు ప్రధాన వీధిలోని అమ్మవారి ఉత్సవగద్దెకు అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. ఉత్సవగద్దె వద్ద అమ్మవారి ఘటాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాలు, పాలధారకు ఉయ్యాల కంబాల కార్యక్రమాన్ని గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు నిర్వహించారు. ఉత్సవగద్దె(యాత్రాస్థలం)నుంచి అమ్మవారి ఘటాలు కాలినడకన భక్తుల జయజయధ్వానాల నడుమ వనంగుడికి చేరుకున్నాయి. వనంగుడికి చేరుకున్న ఘటాలతో వనంగుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణచేసి, వనంగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారి పాదాల చెంత ఘటాలను ఉంచారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. వచ్చేనెల 4వతేదీన అమ్మవారి మారు జాతరను నిర్వహిస్తారు.

విస్తరిస్తున్న కుష్ఠు వ్యాధి

- ఇంటింటి సర్వేలో అనుమానితుల గుర్తింపు
- ఈనెల20 నుంచి ప్రారంభమైన సర్వే
- ఇంతవరకు 1879 మంది అనుమానితులు
- 736 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ఆరుగురికి వ్యాధి నిర్ధారణ



గంట్యాడ మండలంలోపెదవేమలిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: అవగాహన లేకో, అలసత్వమో తెలియదు కానీ కొంతమంది కుష్ఠు వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధి లక్షణాలు కనిపించినప్పటికీ అలసత్వం వహించడం వల్ల వ్యాధి బారిన పడుతున్నారు. ఫలితంగా చాపకింద నీరులా కుష్ఠు వ్యాధి వ్యాప్తి చెందుతోంది. కుష్ఠు రోగులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. వ్యాధి తీవ్రమై అంగవైకల్యం బారిన పడే వరకు కొంతమంది కుష్ఠు వ్యాధి సోకిందని తెలుసుకోలేక పోతున్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాల గురించి బయటకు చెబితే ఏం అనుకుంటారోనని అనుమానంతో వ్యాధి తీవ్రమయ్యే వరకు చాలా మంది చెప్పడం లేదు. దీంతో కుష్ఠు కేసులు పెరుగుతున్నాయి. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల వ్యాధి వ్యాప్తిని అరికట్టడంతో పాటు రోగులు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడడానికి అవకాశం ఉంటుంది.

1879 కొత్త కేసుల నమోదు

జిల్లాలో ఈనెల20వతేదీ నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే పారంభం అయింది. ఫిబ్రవరి 2వతేదీ వరకు ఈ సర్వే జరగనుంది. జిల్లాలో రెండేళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరికీ కుష్ఠు వ్యాధిపై సర్వే చేసి స్క్రీనింగ్ చేయనున్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో 1879 మంది అనుమానితులను గుర్తించారు. వారిలో 736 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇందులో 6 కొత్త కేసులు నమోదయ్యాయి. ఇంకా 1143 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది.

రెండు రకాలుగా చికిత్స

- పాసీ బ్యాసిల్లరీ (పి.బి) అంటే కుష్ఠు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి ఆరు నెలల చికిత్స ఉంటుంది.
- మల్టీ బ్యాసిల్లరీ(ఎం.డి) అంటే ఐదు మచ్చల కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి 12 నెలలు చికిత్స ఉంటుంది.

వ్యాధి లక్షణాలు :

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, బత్తాయి తొక్కలాగా ఉండడం
- చెవులపై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

వ్యాధి సోకేది ఇలా..

కుష్ఠు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల చర్మానికి, నరాలకు సోకుతుంది. ఆ వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి కూడా వ్యాధిసోకే ప్రమాదం ఉంది.

అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు:



కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో గుర్తించిన అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడతాం, అదే విధంగా వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స ప్రారంభిస్తాం. 58 శాతం సర్వే ఇప్పటి వరకు పూర్తయింది. ఫిబ్రవరి 2 వతేదీతో సర్వే పూర్తవుతుంది. రెండేళ్లు దాటిన ప్రతి ఒక్కరికి కుష్ఠు వ్యాధిపై స్క్రీనింగ్ చేస్తున్నాం.

డాక్టర్ కె. రాణి,
జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి

2 గంటల్లో మూడు చోరీలు..!

- షట్టర్లు విరగ్గొట్టి దోపిడీ



దొంగలు పడిన కొరియర్ సర్వీస్ దుకాణం

శృంగవరపుకోట: కొంతకాలంగా పోలీసులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యానికి స్థానికులు మూల్యం చెల్లిస్తున్నారు. మంగళవారం రాత్రి ప్రధాన రహదారిలో రెండు గంటల వ్యవధిలో మూడు దుకాణాలను దొంగలు దర్జాగా దోచుకుని పోలీసులకు సవాల్ విసిరారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల సమయంలో సీతంపేట నుంచి ఎస్.కోట వస్తున్న ప్రధాన రహదారిలో కొరియర్ సర్వీసు నిర్వహిస్తున్న దుకాణం షట్టర్‌ను విరిచి షాపులో చొరబడ్డారు. సీసీ కెమెరాలు ఉన్నా ఏమాత్రం బెరుకు లేకుండా, కెమెరాలు విరగ్గొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.70వేలు దోచుకున్నారు. మరో కిలోమీటర్ దూరం ముందుకొచ్చి వన్ వే జంక్షన్ వద్ద ఆర్.కె. వైన్‌షాపు షట్టర్ ఎత్తి లోనికి చొరబడ్డారు. దుకాణంలో నుంచి మందుబాటిల్స్ పట్టుకుపోయారు. అక్కడితో ఆగకుండా విశాఖ-అరకు ప్రధాన రహదారిలో ఉన్న అరుణాచల ట్రేడర్స్ పేరుతో ఉన్న హోల్‌సేల్ కిరాణా దుకాణంలో చొరబడి దుకాణంలో నుంచి ఆరు ఆయిల్ డబ్బాలు, నాలుగు రైస్ బ్యాగ్‌లు, రూ.20వేలు నగదు దోచుకున్నారని యజమాని చెప్పారు.

పర్యవేక్షిస్తున్న సీఐ

పట్టణంలో ఒకే రాత్రి మూడు దుకాణాల్లో జరిగిన చోరీలతో పట్టణ వాసులు ఉలిక్కిపడ్డారు. చోరీ జరిగిన దుకాణదారులు ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ వి.నారాయణమూర్తి తన సిబ్బందితో కలిసి చోరీ అయిన దుకాణాలను పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

11,400 మంది విద్యార్థులకు బెడ్స్ సరఫరాకు చర్యలు

- కిల్లోయిలో రూ.2.7 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు
- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు 11,400 మందికి బెడ్స్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధదవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మందస మండలం కిల్లోయిలో రూ.2.7 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో మూతపడిన 32 జీపీఎస్ పాఠశాలలను వచ్చే విద్యాసంవత్సరం నాటికి తెరిపించనున్నామని పేర్కొన్నారు. పక్కా భవనాలు లేని 7 పాఠశాలలకు భవనాలు నిర్మించనున్నామన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోనున్నామని తెలియజేశారు. ఇందుకోసం ఆర్‌డబ్ల్యూఎస్‌తో సమన్వయ సర్వే చేయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని గిరి శిఖర గ్రామాలకు సరఫరా చేయనున్నామన్నారు. ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా నాలుగు చోట్ల రహదారి విస్తరణ, రక్షణ గోడలు నిర్మించనున్నామని చెప్పారు.

71 రహదారుల నిర్మాణం

మెరుగైన వైద్యసేవలు అందించడానికి రూ.75.26 లక్షలతో అవసరమైన పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. 72 గిరిజన గ్రామాలకు 71 రహదారులు నిర్మించనున్నామన్నారు. గతంలో రైతులకు సరఫరా చేసిన మారిషస్ పైనాపిల్ మంచి దిగుబడి ఇవ్వనుందని గిరిజనులు చెబుతున్నారన్నారు. ఇప్పటికే సర్వే చేశామన్నారు. 53 వీడీవీకేలు ఏర్పాటు చేసి వారు ఉత్పత్తి చేసిన కొండచీపుళ్లు, జీడిపప్పు, ఇతర గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు.

ఏపీఎస్ఎస్డీసీ ద్వారా రెండు నైపుణ్య కార్యక్రమాలు

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారికంగా రెండు నైపుణ్య కార్యక్రమాలను ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్ఎస్డీసీ డిజిటల్ భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు సాధికారత కల్పించేందుకు నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్ ప్రైమ్ సహకారంతో అధికారికంగా రెండు సంచలనాత్మక కార్యక్రమాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసెండ్ ప్రోగ్రామ్ ఒకటన్నారు. ఫ్యూచర్ ఇన్నోవేటర్‌లకు సాధికారత టీమ్ గ్రాడ్యుయేట్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు (2, 3 ఇయర్) పని చేసే నిపుణులను లక్ష్యంగా చేసుకుని, ఈ ప్రోగ్రామ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర అధునాతన సాంకేతికతలపై లోతైన అభ్యాసాన్ని అందిస్తుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ ప్రోగ్రామ్ కోసం ఈ నెల 30వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రెండవ ప్రోగ్రాం డిజిటల్ 101 అని అన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల కోసం రూపొందించిన ఈ కార్యక్రమం, డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందడానికి వారికి పునాది జ్ఞానాన్ని అందించి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను పరిచయం చేస్తుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 5 నుంచి 12వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ రెండు ప్రోగ్రామ్‌ల నాస్కాం సహకారంతో ఉచిత కోర్సు పూర్తి, ధృవీకరణ పత్రాలను అందిస్తాయని, నేటి జాబ్ మార్కెట్‌లో పాల్గొనేవారికి పోటీతత్వాన్ని అందించనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం హెచ్‌టీటీపీ://ఇంజనీరింగ్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ రిజిస్టర్ లింకును ఓపెన్ చేయాలని, మరింత సమాచారం కోసం ఫోన్ 9988853335, 70363 88297 నంబర్లన సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

పరిమితికి మించి ప్రయాణాలపై అవగాహన కల్పిస్తున్నాం

- జిల్లా రవాణా శాఖాధికారి టి. దుర్గాప్రసాద్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పరిమితికి మించి జీపు, ఇతర వాహనాల్లో ప్రయాణించడం వల్ల కలిగే రహదారి ప్రమాదాలపై సాలూరు ఇంధన శకట తనిఖీదారు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొఠియా పరిధిలోని ప్రజలు జీపుల పైభాగంలో కూర్చుని, వెనుక నిల్చొని ప్రయాణించడం వల్ల కలిగే నష్టాలపై తెలియజేస్తునట్లు చెప్పారు. అలాగే జీపు యజమానులు, డ్రైవర్లకు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించడం వల్ల కలిగే రోడ్డు ప్రమాదాల గురించి వివరిస్తున్నట్లు చెప్పారు. కొఠియా పరిధిలో ఆర్టీసీ సౌకర్యం లేనందున, నంద గ్రామం వరకు ఉదయం, సాయంత్రం ఒక్క బస్సు మాత్రమే ఉన్నందున జీపుల పై భాగంలో కూర్చుని, వెనుక నిలబడి వేలాడుతూ రావాల్సిన పరిస్థితి వస్తోందని గ్రామస్తులు తెలిపారన్నారు. ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడి మరిన్ని బస్సులను ఏర్పాటుచేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.

తాలాడ ప్రాంతంలో ఏనుగుల ఆందోళన



ఘనసర నుంచి తాలాడ వైపు తరలి వెళ్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ సమీప పంటపొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు బుధవారం ఆందోళన సృష్టించింది. సమీప గ్రామమైన ఘనసర పంటపొలాల్లో పంట చేలు ధ్వంసం చేశాయి. అనంతరం నాటుదారి వెంబడి తాలాడ పంట పొలాల్లోని మొక్కజొన్న పంటపైకి వెళ్లాయి. రెండవ పంటగా వేసుకున్న మొక్కజొన్న, కర్బూజా, చెరకు, ఇతర పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేసి తినివేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్



గంజాయి కలిగి ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ ఏరియా రైల్వేకాలనీ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నలుగురు అనుమానిత వ్యక్తులను పట్టుకుని విచారణ చేశారు. వారి దగ్గర నుంచి సుమారు రెండుకిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారణ చేసి వారిలో ఇద్దరు ఎస్.కోటకు చెందిన బోరమాల తరుణ్ తేజ, సంపంగి భార్గవ్, పట్టణానికి చెందిన సిరికి సాగర్, జొన్నగుడ్డికి చెందిన పావాడ సాయి చైతన్యలుగా గుర్తించామన్నారు. నలుగురు వ్యక్తులు గంజాయిని కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో గుర్తించామన్నారు. గూడ్స్‌షెడ్ వద్ద బుధవారం గంజాయి అమ్మకాలు చేస్తుండగా పట్టుకుని, రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీ చేసి, వారి నుంచి రెండుకిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వారితో పాటు ఒక మైనర్ ఉన్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రామగణేష్, ఇతర పోలీసు సిబ్బందిని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

జాతీయ రహదారిపై లారీ బీభత్సం



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, మోటార్ సైకిల్

బొండపల్లి: మండల కేంద్రాన్ని అనుకోని బోడసింగిపేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి26పై వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టడంతో లారీ ముందు వెళ్తున్న కారుతో పాటు మోటార్ సైకిల్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న లారీ వేగంగా వస్తూ అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అలాగే కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా బలంగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదంలో మోటార్ సైకిల్ పూర్తిగా నుజ్జయింది. ద్విచక్ర వాహనంపై వస్తున్న సీతానగరం మండలం భద్రంవలస గ్రామానికి చెందిన బలజాన ముకుందకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలు పూర్తిగా విరిగి పోయింది. ఇదే ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మరొకరితో పాటు ద్విచక్ర వాహనం వెనుక ఉన్న మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో విజయనగరంలోని మహరాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముకుందకు మరో పది రోజుల్లో పెళ్లి కావాల్సి ఉండగా శుభలేఖలు పంచడానికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాలిస్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.డేవిడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని కాపాడు కుందాం అనే నినాదంతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం హక్కు కేంద్రం లాగేసిందని, ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందన్నారు. ప్రాథమిక విద్యను ముక్కలు చేసిందని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందని, బీజేపీ కేంద్ర ప్రభుత్వ నేషనల్ విద్యా విధానంలో భాగమే ఈ కుట్ర అని అన్నారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడమే ఈ మార్పుల సారాంశమన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని, రాష్ట్రం హక్కును కేంద్రం లాగేసినా ప్రతిఘటించకపోగా అమలు చేయడం చంద్రబాబు బీజేపీతో కలిసి రాష్ట్రానికి ద్రోహం చేయడమేనన్నారు. కార్యక్రమంలో కవి జి.గౌరినాయుడు, అధ్యక్షులు టి.అఖిల్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాయి, శారద, రాజేష్, కవిత, సుకన్య పాఠశాల యాజమాన్యం తాతబాబు, రవి కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.